క్రేన్ కథల పోటీలో
కన్సొలేషన్ బహుమతి
పొందిన కథ

# పాలరాయి

- మెన్నం ఉపేందర్



**మా** చిన్నాయన ఉదయం నుంచీ చాలా సంతోషంగా ఉన్నాడు. ఊర్లోకి పరుగెత్తి తనకు సన్నిహితులైనందరితోనూ తాను గంగోత్రికి వెళ్తున్నానని చెప్పొచ్చాడు. ఇక ఇంటికి వచ్చేవారి సంగతి సరే సరి. వచ్చిన వారిని కూర్చోబెట్టి తన గంగోత్రి ప్రయాణం గురించి వారి ముఖం విషాదమయం అయ్యేంతవరకి చెబుతూనే వున్నాడు. చిన్నాయన సంతోషం చూస్తుంటే చూడముచ్చటగా ఉంది నాకు. నాకే ఇలాగుంటే, నాతో పాటు వచ్చిన నా స్నేహితుల గురించి వేరే చెప్పనక్కరలేదు. అసలు చిన్నాయన గంగోత్రికి నాతో రావటం ఓ పెద్ద కథ.

ఆ మధ్య నేను మా ఊరికొచ్చాను. ఎప్పుడు ఊరొచ్చినా చిన్నాయన ఇంట్లో చాలా సేపు గడపటం నాకు అలవాటు. మాటల మధ్యలో, మా స్నేహితులతో కలిసి గంగోత్రికి వెళ్తున్నానని చెప్పా. అంతే! పశువులకి మేత వేస్తున్న చిన్నాయన ఒక్క ఉదుటున వచ్చి.

'ఏందిరా బుడ్డోడా! గంగోత్రికి పోతండ్రా నేను సూడవత్త' అన్నాడు, ముఖంలో మెర్క్యురీ బల్బు కాంతితో. లైవ్ కరంటు వైరు మెడకి తాకినట్లు అయింది నాకు.

"ఏం లేదే! మా స్నేహితులతో కలిసి ఢిల్లీకి పోతున్నానని సిన్నమ్మతోని అంటున్న' మాట మార్చాను నేను.

అది విన్న చిన్నాయన.

'బిడ్డా! నువు ఉన్నట్టుండి నాల్క మల్లేస్తే, నాకు దెల్వదను కుంటవా నూరు ఆరైనా, ఆరు నూరైనా నేను మీతో పాటే వస్త' దృఢంగా పలికాడు.

'గది కాదే నేను ఢిల్లీకి...'

'గట్నా! సరె. నేను సుత నీతో పాటుగ ఢిల్లీకొస్త' అంటూ విస విస కొట్టంలోకి వెళ్ళాడు.

చిన్నాయనకు ఎలా సమాధాన పర్చాలో తెలియక మా నాయనను రాయబారం పంపాను. ఇక చిన్నాయన ఢిల్లీ ప్రయాణం బందనుకొని మురిసిపోతూ స్నేహితులతో కలిసి అరిశెలు తిన సాగాను. రాయబారానికి పోయిన నాయన దిగాలుగా వచ్చాడు.

'ఏంది నాయనా' అడిగాను, ఆత్రుతగా.

'లాభం లేదురా. వాడు నీతో పాటే వస్తడట' అసహనంగా అన్నాడు.

'నువు సెప్పలే' ప్రశ్నించాను.

'ఎందుకు సెప్పలే. గట్టిగనేసరికి అన్నందిన నీళ్ళు దాగనని ఒట్టేసిండు. గాడు సిన్నతనం నుంచి ఆకలికి ఓర్వడు. గది తెలిసి నువు ఢిల్లీకి పోదువు లేరా అని వస్తన్న' అన్నాడు.

నాకు తింటున్న అరిశెలు చేదయ్యాయి.

'ఎలా చిన్నాన్నను నాతోపాటు గంగోత్రికి తీసుకెళ్లడం? ఆయన పాతకాలపు మనిషి. పైపెచ్చు తాను ఊరొదిలి ఎరుగడు. అలాంటిది గంగోత్రికా?'

'ఎప్పుడ్రా మనం బయల్దేరేది?' చిన్నాయన గొంతు పిడుగులా వినబడింది.

'............'

'సెప్పవేంది. గుడ్లు మిటకరిస్తన్నవ్.

ఎప్పుడు మనం బోయేది' రెట్టించి అడిగాడు.

'నేటికి ఏడో దినాన' అన్నాను.

'గట్లనా' అనుకుంటూ ఈల వేస్తూ వెళ్ళాడు.

అప్పటి నుంచి నేను మానసికంగా ప్రిపేరయ్యా. చిన్నాయనను ఎలా డీల్ చేయాలో ఓ ప్రణాళిక వేసుకున్నా. రేపు పోతామనగా, చిన్నాయన ఇంటికి వెళ్ళాను.

చిన్నాయన ఓ నాలుగు బస్తాల్నిండా ఏవో సర్దుతూ కనిపించాడు. అవేంటో నేనడక్క ముందే,

'మనకు కావాల్సిన సరంజామా. బియ్యం, పప్పులు, పచ్చళ్ళు, వేంచిన పెసళ్ళు, జొన్న పేలాలు....." చెబుతూ ఉంటే నాకు మతిపోయింది.

'గీయన్నీ ఎందుకే' అమాయకంగా అడిగాను.

'ఏంది బిడ్డా! గట్లంటవు. మనమేం దింటంరా' ఆశ్చర్యం వ్యక్తం చేసాడు.

'ఎహె. గీ సామానంతా యాడ దీసుకెళ్తం. ఒట్టి కట్టుబట్టల్తో రా' కోపాన్ని వెళ్ళగక్కాను.

'నువ్వేమన్న మోస్తున్నావురా. నా సామాను నేను తెచ్చుకుంటున్నా' తెలివిగా బదులిచ్చాడు.

'అప్పుడు నీ సామాను కోసం ఓ బస్సును మాట్లాడాలి' అన్నాను వ్యంగ్యంగా.

'ఇప్పుడేమంటవ్' కాస్త తగ్గాడు.

ఓ గంట చర్చ – ప్రతిచర్చ తర్వాత ఆయన సామాను ఓ బస్తా నిండా సర్దాము.

బయల్దేరే రోజున చిన్నాయన ఉన్నట్లుండి ఇంటి తలుపులు పట్టుకొని ఏడ్వసాగాడు. మా స్నేహితులు గాభరా పడ్డారు. ఇంటి వెనుకకుపోయి పశువులకి మరలా గడ్డి వేసాడు. వాటితో ఏవో మాట్లాడాడు. పొయ్యిలో నిద్రబోతున్న పిల్లికి ముద్దులు పెట్టాడు. ఆయన పిల్లల్ని హత్తుకున్నాడు. భార్యకి చెవిలో ఏవో జాగ్రత్తలు చెప్పాడు. బహుశః గాదె క్రింద పెట్టిన డబ్బులు, బంగారం గురించే అయ్యుంటుందని నా ఊహ. కనిపించిన వారందరినిపేరు పేరున పలకరించి, 'పో-యొస్తా' అని చెప్పాడు. ఏదోలా, మొత్తమ్మీద బయల్దేరాము.

ప్లాట్‌ఫారమ్ బాగా రద్దీగా వుంది. ఈ రద్దీలో చిన్నాన్న ఎక్కడ తప్పిపోతాడేమోనని మా మధ్యలో వుంచుకున్నాము. చిన్నాన్న నెత్తికి రుమాలు చుట్టుకొని, గంజిపెట్టిన షర్టు, ధోతి కట్టుకున్నాడు. తలమీద బస్తా అలాగే వుంది.

ఇంతలో మెమెక్కాల్సిన రైలు ప్లాట్‌ఫారమ్ మీదికి దూకుడుగా రాసాగింది. వస్తున్న రైలును చూసి బతుకుజీవుడా అన్నట్లు పారిపోసాగాడు. అందరం పరుగెత్తి చిన్నాన్నను పట్టుకున్నాము. అప్పటికే రైలొచ్చి ఆగింది. వెనక్కి తిరిగి చూసి,

'రైలు బండి మీది కొస్తదనుకున్నరా. మొన్న వలిగొండ దగ్గర రైలు కూలి ఎంతమంది సచ్చింద్రో' భయపడుతూ అన్నాడు చిన్నాయన. విషయం తెలిసిన మా స్నేహితులు గుంభనంగా నవ్వుకున్నారు. రైలు బయలుదేరింది. మా చిన్నాయన బిత్తర చూపులు చూడటం నేను గమనించాను.

కన్నాట్ ప్లేస్‌లో అధునాతన డ్రెస్సుల్లో వున్న యువతీ యువకుల్ని చూసి చిన్నాన్న కలవరం చెందాడు.

'గదేందిరా సిన్నోడా! గాళ్ళు ఆడోళ్ళా మగోళ్ళా దెల్వటం లేదు. ఒంటి మీద జానెడు బెత్తడు గుడ్డలేసుకుంటుండ్రు. అవ్వ! ఎంత ఇజ్జత్ తక్కువోళ్ళు' నోరు నొక్కుకున్నాడు.

'ఏందే' అడిగాను.

నెమ్మదిగా వేలు కిటికి వైపు చూపిస్తూ,

'చెట్లు, ఇండ్లు ఉరుకతన్నయేందిరా' అడిగాడు. తిరిగి,

'ఇంత సేపాయె రైలు కదలట్లేదు. అవ్వేమొ ఉర్కుతన్నై' అనుమానపడ్డాడు.

రైలు పోబట్టి శానసేపయింది. సూడు' అంటూ కిటికీ వైపు తీసుకెళ్ళాను.

'నిజమేరా... కాని బూమెందుకు ఎనక్కి ఉర్కుతన్నట్లు కనవడ్డది' తనలో తాను గొణుక్కున్నాడు.

ఇంతలో పల్లీలు అమ్మే అమ్మాయొచ్చింది. మా స్నేహితులు పోటీలు పడి కొనుక్కుంటున్నారు. అది చూసి మా చిన్నాయన,

'ఎన్ని పైసలమ్మా' అడిగాడు.

'ఐదు రూపాయలు' అమ్మాయి అన్నది.

'బుట్ట మొత్తానికా' అమాయకంగా అడిగాడు. అక్కడ తెలుగు తెలిసిన తోటి ప్రయాణీకులందరూ నోళ్ళు వెళ్ళబెట్టారు.

ఆ అమ్మాయి తనని తాను స్థిమిత పరుచుకొని,

'కాదు పెద్దయ్యా. ఈ పిడికెడికి' అన్నది.

ఈసారి చిన్నాయన నోరెళ్ళ బెట్టాడు.

రైలు స్పీడుమీదున్నది. ఏదో పుస్తకం చదువుకుంటున్న నన్ను చిన్నాయనతట్టాడు.

'రైలు పట్టాల మీద పోతదంటరుగా. పట్టాలు తప్పితే అనుమానం వ్యక్తంచేశాడు'.

'ఉహూం. తప్పదే' అన్నాను.

'అహాం కాదు. ఒకాల తప్పితే'

'ఇంకేముంది. వలిగొండే' నా స్నేహితుల్లో ఒకడు అనటం, మిగతా వారు గొల్లుమనటం జరిగింది. చిన్నాయనకు చిన్నతనం అని పించింది. ఆ తర్వాత చాలాసేపు మాట్లాడ లేదు.

రైలు నాగ్‌పూర్ దాటింది. నారింజపండు తింటూ,

'ఎదురుంగా రైలు వస్తే ఎట్లారా' అడిగాడు చిన్నాయన.

చిన్నాయన మెదడులో ఎన్నో ప్రశ్నలున్నాయనిపించింది.

'ఎదురుంగా వచ్చే రైలు పక్క పట్టాలమీంచి పోతది' అన్నాను.

'ఓహో గట్లనా' అనుకుంటూ పక్కనున్న పట్టాలు చూసి స్థిమితపడ్డాడు. అంతలోనే,

'బోల్డన్నీ రైళ్ళున్నయ్ గదా గయన్నీ ఒక్కసారే పట్టాల మీద తిర్గుతయా లేక ఒక్కొక్కటి తిర్గుతయా' అడిగాడు.

'సాన రైళ్లు తిరుగుతై. అవి ఎక్కడెక్కడ తిరుగుతన్నయో సూసెటందుకు ఏరే మనుసులుంటరు' అన్నాను.

'మనం రైళ్ల గూకున్నాం గదా. గీ రైలు పట్టాల మీద ఉర్కుతంది గదా. అయితేపట్టాలు ఎంత దూరం దనుక ఉంటై' అడిగాడు.

'ఓహ్! కష్టమైన ప్రశ్న. ఎలా జవాబిచ్చేది' అనుకుంటున్నప్పుడు,

'ఢిల్లీ దనుక' మా స్నేహితుడు జవాబిచ్చాడు.

'గా తర్వాత' చిన్నయన అడిగాడు.

'గా తర్వాత ఉండవు'

'ఓ గంతేనా' స్థిమితపడ్డాడు.

కొద్ది సేపటి తర్వాత చిన్నాయన నా చెవిలో,

'శానా సేపట్నుంచి ఒంటేలుకొస్తంది. రైలాగితే జట్న పోయొద్దామనుకుంటే అసలు ఆగటం లేదు. ఎట్లారా' అడిగాడు.

ఎవ్వరైన విన్నారేమోనని అటు ఇటు చూసి, చిన్నాయనను టాయిలెట్‌కు తీసుకుపోయాను.

ఆగ్రాలో దిగాము. మేము ముందు రిజర్వు చేసుకున్న హోటల్ రూంలో ఫ్రెషప్ అయ్యాము. ఆకలి దంచేస్తుండటంతో ఏదైనా తిని తాజ్ మహల్ చూద్దామనుకున్నాము. పుల్కాలు, శానబటూరా కూర చూసి చిన్నాయన,

'అన్నమేదిరా' హూంకరించాడు.

'అన్నమా' నోరెళ్ళ బెట్టాము.

'ఆఁ అన్నమే' ఉరిమాడు.

'ఇక్కడ అన్నం దొరకదు'

అంతే! చిన్నాయన ఉగ్రరూపం దాల్చాడు.

'నేను పదిరోజులకి సరిపడా అన్నం. పప్పులు తెస్తాంటే నువ్వెందుకు వద్దన్నవ్. నాకు అన్నం గావాల. ఈ రొట్టెలెందుకు' విసురుగా లేచిపోయాడు. నాకు ఆకలి చచ్చిపోయింది. మా స్నేహితులు మాత్రం యధాశక్తి లాగించేస్తున్నారు. ఏం చేయాలో తెలియక చిన్నాయన వెంట హోటల్ గదికి వెళ్ళాను. చిన్నాయన తాపీగా బెడ్‌పై చకిలం ముకిలం వేసుకుని జొన్న పేలాలు, బెల్లం ఒకసారి, జంతికలు మరోసారి నములుతున్నాడు.... నాకు కోపం వచ్చింది. ఆకలి జ్ఞాపకం వచ్చి, హోటల్‌కి పరిగెత్తాను.

అందరం కలిసి తాజ్‌మహల్ దర్శనానికి వెళ్లాము. తాజ్ అందానికి చిన్నాయన ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఆ పాలరాతి నేలపై పడుకున్నాడు, దొర్లాడు ఇంకా ఏవోవో చేశాడు.

'ఎంత నల్ల గుందిరా ఈ రాయి. ఇల్లు కట్టుకుంటే ఈ రాయితోనే కట్టుకోవాలి' అన్నాడు.

ఏం జవాబీయాలో తెలియక పళ్ళిగిలించాను.

'యాడ దొరికుద్దిరా ఈ రాయి'అడిగాడు.

'దొరికితే దీస్కబోతావా' వ్యంగ్యంగా అడిగాను.



'ఆఁ' కూల్‌గా జవాబిచ్చాడు.

'పూర్వకాలంలో ఈ రాయి దొరికేది. ఇప్పుడు దొరకట్లే' నోటికొచ్చిన జవాబిచ్చాను.

'అట్లనా' దిగులుపడ్డాడు చిన్నాయన.

'ఓ రాయి ముక్కైన దొరుకుద్దా' అడిగాడు.

'ఇక్కడ రాయి తీస్తే పోలీసులు పట్టుకుంటరు' భయపెట్టాను. ఎక్కడ ఏ రాయి పీకుతాడోనని.

'నాకు రాయి కావాలి. లేకపోతే నేనిక్కడే వుంటా' భీష్మించుకున్నాడు.

నాకేం చెయాలో తోచలేదు.

'చిన్నాన్న! ఇక్కడికొచ్చిన మంచివాళ్ళందరికి పిలిచి పాలరాయి ముక్కలిస్తరట' అన్నాను. తాజ్‌మహల్ గేటు దాటిన తరువాత,

'ఇదిగో రాయి' అంటూ జేబులో తీసి చూపించాడు చిన్నాన్న.

'యాన్నుంచి తీసినవ్' అడిగాడు ఓ స్నేహితుడు.

చిన్నాయన ఎడమ చేయి వంకలు తిరిగి మీసాల్ని సవరించుకుంది

ఢిల్లీకి చేరుకున్నామనేగాని నాలో ఓ ఏరువాక పాట మొద లెట్టాడు. పోలీసులు ఎ.కె.-47 తుపాకులు పట్టుకుని చిన్నాన్న వెంటబడితే ఒక్కో బిల్డింగ్ మీదనుంచి చిన్నాన్న దూకుతూ కుతుబ్‌మినార్ చేరుకున్నాడు. అక్కడి స్తంభాన్ని ఒక్క ఊపు ఊపాడు. అంతే! పట! పట! ....' వీపుపై దెబ్బలు.

'ఏందిరా! ఏదో కలవరిస్తున్నావు' స్నేహితుడు అడిగాడు.

అదంతా కలని అర్థమై చిన్నాన్న వైపు చూస్తే ఆయన హాయిగా నిద్రపోతున్నాడు.

తెల్లవారి భయం భయంగానే ఢిల్లీలోని స్థానిక ప్రదేశాలు చూశాము. జాతీయ మ్యూజియం, రాష్ట్రపతి భవనం చిన్నాన్నను ఆకట్టుకున్నాయి.

హరప్ప నాగరికత ప్రదర్శన గ్యాలరీని జ్ఞాపకం చేసుకుంటూ,

'అంటే 2వేల యేండ్ల ముందు నుంచే మనుషులు కుండలు, గంటెలు వాడుతున్నారంటవు' అన్నాడు. ఎవరు మాట్లాడే సాహసం చేయలేదు.

కన్నాట్ ప్లేస్‌లో అధునాతన డ్రస్సుల్లో వున్న యువతీ యువకుల్ని చూసి చిన్నాన్న



కలవరం చెందాడు.

'గదేందిరా సిన్నోడా! గాళ్ళు ఆడోళ్ళా మగోళ్ళా దెల్వటం లేదు. ఒంటి మీద జానెడు బెత్తడు గుడ్డలేసుకుంటుండ్రు. అవ్వ! ఎంత ఇజ్జత్ తక్కువోళ్ళు' నోరు నొక్కుకున్నాడు.

అందరం కలిసి పాలికా బజార్లో షాపింగ్ కు వెళ్ళాం. చిన్నాయన పిల్లలకి బట్టలు తీసుకున్నాడు. చిన్నాయన తరుపున మేము గీచి గీచి బేరమాడాం. షాపతను ఫిక్స్‌డు రేట్లంటు న్నాడు, చిన్నాయనేమో తను అడిగిన రేటుకు ఇవ్వాలంటున్నాడు. ఎలా ఈ కష్టం నుంచి బయట పడేది?

'గదేందిరా సిన్నోడా! షాపోడు నేను గంత తక్కువకి అడిగితే అదే ధరకిచ్చిండు. ఇక్కడ బట్టలు శాన సౌకున్నట్లున్నయ్' అన్నాడు.

తెల్లవారి టూరిస్ట్ బస్సులో-రిషికేష్, హరి ద్వార్ బయలుదేరాం. ఈ మధ్యలో చిన్నాన్నకి ఎటువంటి సందేహాలు రాలేదు. గంగానది, లక్ష్మణ్ జూలా చూసి చిన్నాన్న ఉక్కిరి బిక్కి రయ్యాడు.

'దీని గురించే మనూరి పంతులు సెప్పేదన్న మాట' అంటూ చొక్కా, ధోతి తటాల్న దీసి,

'ఇగ పట్ర సిన్నోడా' అంటూ నాకిచ్చి జూల మీదనుంచి గంగానదిలోకి దుమికాడు.

అది చూసిన జనం హాహాకారాలు చేశారు. ఎవరో పోలీసులకి సమాచారం అందించారు. అంతటా కలకలం.

శల పగిలి వుండవచ్చు', 'కొన తో నైనా వుండో లేడో', కో కొట్టుక పోయుండొచ్చు', గంగానదిలో దూకి లనుకున్నాడో ఏమో. త్ముడు. కైవల్యప్రాప్తిరస్తు', చావడానికి పవిత్ర గంగానది స్సొచ్చిందా? పాపాత్ముడు', వి చోచ్చడంట', 'కాలుజారిందేమో'.

జనం రకరకాలుగా అనుకుంటున్నారు. మా చిన్నాన్న గజ ఈతగాడని తెలుసు. దొరోరి బాయిలో చెట్టుమీద నుంచి దునికి, అడుగు మట్టి తెచ్చేవాడు. నాకు కాస్త ధైర్యంగా అనిపించినా భయం కూడా కలిగింది. గబగబా దిగి నీటి వాలు వైపు వెళ్ళాను. ఎటు చూసినా చిన్నాయన కనిపించలేదు.

'అయ్యో! చిన్నాన్నా. పోయి పోయి నువ్వు ఇక్కడ పోయావా' పైకే అన్నాను.

'యాడకి బోతరా బుడ్డోడా! నీళ్ళను జూసేసరికి దుమకాలనిపించింది' అంటూ నా వెనుక వైపు నుంచి వచ్చాడు.

నాకు ఒళ్ళు తెలియని కోపం వచ్చింది. అయినా నిగ్రహించుకున్నాను. పైకి వెళితే జనం ఎక్కడ కొడతారేమోనని అనిపించి, చిన్నాన్నను వేరే దారి ద్వారా తీసుకెళ్ళాను.

ఏదోలా దర్శనం పూర్తిచేసుకుని గంగోత్రి కి బయలుదేరాం. ఘాట్‌రోడ్‌పై ప్రయాణం బస్సులోని వారందరూ భళ్ళున వాంతి చేసుకున్నారు. చిన్నాన్న కదలకుండా కూర్చుని, మధ్య మధ్యలో పక్కపక్కకి చూస్తూ తనలో తాను ఏదో మాట్లాడుకుంటున్నాడు.

'ఏందే! నీలో నువ్వు మాట్లాడుకుంటన్నవ్' అడిగా.

'జర పక్కకు సూడ్రా ఈబస్సు ఈబొందల పడ్తే మనం మిగుల్తమా? మన బొక్కలన్నా దొర్కుతయా?'

నాకు చిన్నాన్న చెప్పే మాటలు విన పడటంలేదు. చెవుల్లో ఏవో శబ్దాలు...

'అవ్వరా! ఏదన్నా బస్సు మన బస్సుకు టక్కరిస్తే' ప్రశ్నించాడు.

నేనేం జవాబియ్యలేదు. 'అడుగుతుంటే సెప్పవేంది' అడిగాడు.

'టక్కరియ్యదు'. 'ఆహాఁ టక్కరిస్తే' నాకు కోపం పెరిగింది.

'నువ్వు జూపిచ్చిన బొందల పడి సస్తం. బొక్కలు గూడ దొరకవ్' కసిగా అన్నాను.

'ఓ. సాల్లేవో. లెసగోపం జూపిస్తన్నవ్. బస్సును బస్సు ఉత్తగనే టక్కరిస్తాది! నవ్వాడు.

'.........' పల్లు సైలంటుగా కొరికాను. చిన్నాన్న జంతికలు నమలడం మొదలుపెట్టాడు.

'గంగోత్రి వచ్చేసింది.

గంగానదిని చూడగానే చిన్నాన్న ఎక్కడ దూకుతాడోనని బిగ్గరగా పట్టుకున్నం.

'ఏం దునుకను లేరా. ఇక్కడ దునికినా ఎవరు లొల్లి పెట్టరు' హాస్యం ఒలకబోసాడు.

ఓ పెద్ద ఇత్తడి పాత్రలో గంగాజలం సీల్ చేయించాడు. భక్తితో గంగమ్మ నీళ్ళు నెత్తిన బోసుకున్నాడు. చిన్నాన్న కళ్ళల్లో అనంతమైన సంతృప్తి.

తిరుగు ప్రయాణంలో బుద్ధిగా ఏం ప్రశ్నలు వేయకుండా మాతో వచ్చాడు చిన్నాన్న. ఊరు ఊరంతా సమావేశ పరచి తాను చూసిన విషయాల్ని జనానికి చెప్పాడు. తాను తెచ్చిన పాలరాయి, బట్టల్ని చూపించాడు.

'ఢిల్లీల బట్టలు యమ సౌక. గీ పాల రాయితోనే తాజ్‌మహల్ కట్టింది' కనిపించిన వాళ్ళందరికి చెబుతున్నాడు.

చిన్నాయనకి అసలు విషయం తెలియదు. ఢిల్లీలో షాపతనితో లోపాయకారి ఒప్పందం కుదుర్చుకున్నాను. చిన్నాయన అడిగిన ధరకే ఇచ్చినట్లు చిన్నాయనను నమ్మించి, బ్యాలెన్సు డబ్బులు షాపతనికి ఇచ్చాను. ఇక పాలరాయి సంగతి. బయట పాలరాయి ముక్క కొని వేరే వ్యక్తితో చిన్నాయనకి నేనే ఇప్పించా. ఈ రహస్యం మా చిన్నాన్నకి చెప్పకండీ! నిరక్షరాస్యుడైనా మా చిన్నాన్న ఓ చల్లచల్లని పాలరాయి!!